



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ రెడ్డి

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): బక్రీద్ నేపథ్యంలో జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ, పోలీసు అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి హాజరై మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల వద్ద 24 గంటలపాటు పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తారని, పశువుల విక్రయాలు జరిపితే రైతులు, వ్యాపారులు సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి ధ్రువీకరించిన అసలు రసీదులను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేకుండా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ధారూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

తేమశాతం ఎక్కువున్నా కొనండి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ధారూరు/పెద్దేముల్, మే 28(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు ధాన్యం ఆరబెట్టే అవకాశం లేదని, తేమ శాతం ఎక్కువ ఉన్నా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ధాన్యం తేమ శాతం 24 నుంచి 34 వరకు రావటాన్ని గుర్తించిన ఆయన ధాన్యాన్ని తూకం చేసి మిల్లులకు వెంటనే పంపించాలని కేంద్రం ఇన్‌చార్జి రవిని ఆదేశించారు. రైతులు నష్టపోకుండా అవసరమైన హమాలీలను, లారీలను అదనంగా సమకూరుస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఉన్నారు. అలాగే పెద్దేముల్ మండలం మంబాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాలకు ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కాంటావేసి మిల్లర్లకు పంపించాలని నిర్వాహకులకు ఆదేశించారు. అదనంగా లారీలు, హమాలీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



జీలుగా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ

దోమ, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్సంపల్లిలో డీఎస్‌ఎంఎస్ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను బుధవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సత్యయ్యగౌడ్, బందెయ్య, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దారికి తేరా?

ఉమ్మడి జిల్లాలోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. ఏళ్ల తరబడి ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అడుగుకో గుంత.. గజానికో గొయ్యి ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. ఈ దారుణ దారులపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. గుంతలమయమైన రోడ్లపై బైకులు నడిపితే నడుం విరగ్గొట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కంకర తేలిన రోడ్లతో కార్లు, బైకులు మరమ్మతులకు గురై ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇక వర్షం పడితే చాలు చిత్తడిగా మారి రోడ్లపై వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో రోడ్ల మరమ్మతుల్లో తీవ్ర జాప్యం జరగడం, కొన్ని ప్రాంతాల్లో ప్రతిపాదనలకే పరిమితం కావడం, మరి కొన్నిచోట్ల శంకుస్థాపనలు చేసి వదిలేయడంతో రోడ్లన్నీ దరిద్రంగా దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో నరకప్రాయంగా రోడ్లు



అధ్వానంగా దోమ నుంచి పాలేపల్లి, అయినాపూర్ వెళ్లే రోడ్డు

- అడుగుకో గుంత.. గజానికో గొయ్యి
- మరమ్మతులకు నోచని రహదారులు
- నిధులున్నా జరగని నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఆమనగల్లు : జంగారెడ్డిపల్లి -చంద్రాయన్‌పల్లి రోడ్డు ఇలా..

వికారాబాద్/మేడ్చల్ మే 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 934 కిలోమీటర్ల మేర ఆర్ అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి 500 కిలోమీటర్లు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైనప్పటికీ.. బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రోడ్ల మరమ్మతులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. మరికొన్ని శంకుస్థాపన చేసి వదిలేశారు. పనులు ప్రారంభించిన చోట ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దేవరాంపల్లి నుంచి ఆలూరు వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. నాలుగేళ్ల నుంచి రెండు పర్యాయాలు టెండర్ ప్రక్రియ చేపట్టినా కాంట్రాక్టర్ ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వికారాబాద్ జిల్లా కొడంగల్

మిగతా 7వ పేజీలో...

పూర్తికాని సర్వే..

మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 56 కిలోమీటర్ల మేర 24 రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతు కోసం రూ.34 కోట్లు మంజూరయ్యాయి. హ్యామ్ పద్ధతిలో జిల్లాలో ఆర్‌అండ్‌బీ అధికారులు 46 కిలోమీటర్లు, పీఆర్ అధికారులు 140 కిలోమీటర్లకు ప్రతిపాదనలు పంపారు. ఇంకా సర్వే పనులు పూర్తి కాలేదు. సర్వే పూర్తయితే అనుమతులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొత్త రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టలేదు. గతంలో నిర్వహించిన కొన్ని రోడ్ల పనులకు కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు.

ఏళ్ల తరబడి నిలిచిన పనులు..

యాచారం మండల కేంద్రం నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రూ.78 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు మూడున్నరేళ్లుగా నిలిచిపోయాయి. యాచారం నందివనపర్తి- మేడిపల్లి మధ్య రహదారి నిర్మాణం కోసం రూ.48 కోట్లు మంజూరైనా పనులు సాగడం లేదు.



డబ్బులిస్తేనే **రుణాలిప్పిస్తా..**
రంగాపూర్ వీవోఏ చేతివాటం
మహిళలతో అసభ్యకర ప్రవర్తన
చర్యలు తీసుకోవాలని ఆందోళన
7

పది సప్లిమెంటరీ పరీక్షలకు **ఏర్పాట్లు చేయాలి**
వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
7

వానొచ్చే..వరదొచ్చే

దోమలో అత్యధికంగా 49.3 మి.మీ. వర్షపాతం నమోదు



బొంరాస్‌పేట్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడుస్తున్న ధాన్యం

- వాగులు, వంకల్లో చేరిన వర్షపు నీరు
- జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఇబ్బందులు పడ్డ అన్నదాతలు, ప్రజలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మే 28: వికారాబాద్ జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. దోమలో 49.3 మి.మీ. వర్షం కురియగా, వికారాబాద్‌లో 47.0 మి..మీ., బషీరాబాద్‌లో 43.5 మి.మీ. వర్షం కురిసింది. పూడూరు మండలం మన్నేగూడలో 40.0 మి.మీ., మద్గుల్ చిట్టంపల్లిలో 31.0 మి.మీ., కొడంగల్‌లో 28.5 మి..మీ, యాలాల్‌లో 27.3 మి.మీ, మోమిన్‌పేట్‌లో 25.8 మి..మీ., పుట్టపహడ్‌లో 24.0 మి..మీ, నవాబ్‌పేట్‌లో 23.0 మి.మీ. వర్షం కురిసింది. ధారూరులో 21.8 మి.మీ., కోట్‌పల్లిలో 21.5 మి.మీ., బొంరాస్‌పేట్‌లో 21.3 మి.మీ., మర్పల్లిలో 20.0 మి.మీ., పెద్దేముల్‌లో 17.5 మి.మీ., బంట్వారంలో 17.3 మి..మీ., చౌడాపూర్‌లో 15.8 మి.మీ., తాండూరులో

మిగతా 8వ పేజీలో...



వికారాబాద్‌లోని అలంపల్లి మెయిన్ రోడ్డులో వరద, వాహనదారుల ఇబ్బందులు

అక్రమ రిజిస్ట్రేషన్లపై మంత్రి సీరియస్

విచారణకు ఆదేశించిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- పూర్తి నివేదిక సమర్పించాలని హుకుం
- రిజిస్ట్రేషన్లపై ఆడిట్..
- క్రయవిక్రయాలకు బ్రేక్
- పూర్తి స్థాయి నివేదికతో మంత్రి వద్దకు అధికారులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించడంతో అధికారులు కదిలారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీల మధ్య జరిగిన రిజిస్ట్రేషన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో బుధవారం జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ వెంకటరమణ ఆధ్వర్యంలో అక్రమాలపై విచారణ చేపట్టారు. ఐదు గంటలకుపైగా నిబంధనలకు విరుద్ధంగా చేసిన రిజిస్ట్రేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి క్రమబద్ధీకరణ పొందని లేఅవుట్లకు సంబంధించి సుమారు 220 ప్లాట్లను నాలుగు రోజుల వ్యవధిలో ఇన్‌చార్జిగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న ఫసియొద్దీన్ పీరియడ్‌లో ఈ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రుజువు కావడంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విధితమే. తర్వాత అక్రమ రిజిస్ట్రేషన్లపై మీడియాలో కథనాలు రావడంతో ఈ వ్యవహారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి వెళ్లింది.

కదిలిన యంత్రాంగం.. విచారణ

ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో 'తాండూరులో భారీగా అక్రమ రిజిస్ట్రేషన్లు' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై పూర్తి నివేదికతో తన వద్దకు రావాలని మంత్రి ఆదేశాలతో అధికారులను తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆడిట్ జరిపారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లకు

మిగతా 8వ పేజీలో...



గౌతాపూర్‌లో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

ఫర్టిలైజర్ షాపుల్లో ముమ్మర తనిఖీలు

తాండూరు రూరల్/కులకచర్ల, మే 28, (ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఫర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయ అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. డీఏవో ప్రసన్నలక్ష్మి బుధవారం మండలంలోని గౌతాపూర్‌లోని సాయిధనలక్ష్మి ఫర్టిలైజర్స్, తాండూరులోని రవిరాజ్ ఫర్టిలైజర్స్, కులికిచర్లలోని దుకాణాలను ఏవో కొమరయ్యతో కలిసి తనిఖీ చేశారు. విత్తనాలు, రసాయనిక ఎరువులు కొనుగోలు చేసిన రైతులు రసీదులను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. కొన్ని ఫర్టిలైజర్ షాపుల్లో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 13 షాపులను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్ వ్యాపారులు రికార్డులను సరిగా నిర్వహించాలని డీఏవో ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. కులకచర్లలో విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

మొలకెత్తిన ధాన్యంతో రైతుల నిరసన

దోమ, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అయినాపూర్ గ్రామానికి చెందిన రైతులు బుధవారం మొలకెత్తిన ధాన్యంతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ధాన్యంపై టార్పలిన్లు కప్పినా రోజూ కురుస్తున్న వర్షాలతో నీరు లోపలికి వెళ్లి వడ్లు తడిసి మొలకెత్తుతున్నాయని వాపోయారు. కేంద్రానికి సకాలంలో లారీలు, గన్నీ బ్యాగులు రాకపోవడంతో ధాన్యాన్ని విక్రయించేందుకు పడిగాపులు కాస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పాలెపల్లి గ్రామంలోనూ అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బుగ్గయ్య, రుక్మయ్యగౌడ్, నర్సింలు, అశోక్, సిద్దయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐనాపూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలి

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని విలియమూన్ గ్రౌండ్‌లో జీఎంకే బిల్డర్స్ అధినేత ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి 40 జట్లు పాల్గొన్నాయి. అనంతరం ప్రభుత్వ ఆయన మాట్లాడుతూ ముజీబ్ ఖాన్ సేవా దృక్పథంతో పని చేసేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన సహకారాన్ని అందిస్తానని పేర్కొన్నారు. గతంలో తాండూరు ప్రాంతంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరుణం పురుషోత్తంరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జయపురి కాలనీలో హైడ్రా కూల్చివేతలు

ఘట్‌కేసర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని జయపురి కాలనీలో బుధవారం హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. స్థానికుల ప్రకారం.. జయపురి కాలనీ సర్వే నంబర్లు 559, 563, 566లలో 1968లో లేఅవుట్ చేశారు. ఈ వెంచర్‌లో గతంలో అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే ఘట్‌కేసర్‌కు చెందిన కొందరు నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి మాదే వ్యవసాయ భూమి అంటూ ఎవరికివారు ప్రహరీ నిర్మించారు. ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మందికి లోపలికి వెళ్లకుండా చేయడంతో ఫిబ్రవరిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రోడ్లకు అడ్డంగా నిర్మించిన గోడలను కూల్చివేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): పని నెపంతో ఆర్టీసీ కార్మికులపై డిపో మేనేజర్ వేధింపులను నిరసిస్తూ విశాల జేఏసీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో ఎదుట బుధవారం కార్మికుల ఎర్రబాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులపై విపరీతమైన పనిభారం మోపుతూ, ఇబ్బందులకు గురిచేస్తున్న డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, కో-కన్వీనర్ చందర్, జంగయ్య, రజాక్, సత్తయ్య, పరమేష్, మల్లేష్, శ్రీశైలం, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



నాడు మాటిచ్చి.. నేడు నెరవేర్చా

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ/నందిగామ, మే 28(ఆంధ్రజ్యోతి): నాడు పార్టీ నాయకుడిగా గిరిజన మహిళకు మాటిచ్చి.. నేడు ఎమ్మెల్యేగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం మల్కాపహాడ్, వాచ్యతండా, హెమ్లతండా, రుక్కాలితండా, చింతకుంట తండా, జిల్లేడ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్కాపహాడ్ తండాలో 2023 ఆగస్టు 9న పల్లె నిద్రలో భాగంగా గిరిజన మహిళ శివమ్మ ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మాట ఇచ్చి.. నేడు షాద్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచి నీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, చంద్రశేఖర్, రజిత, వెంకట్‌నర్సింహ, సత్యనారాయణరెడ్డి, గోబ్రానాయక్, సలీం, తహసీల్దార్ జగదీశ్వర్, ప్రవీణ్‌కుమార్, వంశీకృష్ణ, పాల్గొన్నారు. నందిగామ మండలం చాకలిగుట్ట తండా, తాటిగడ్డ తండా, రంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తాటిగడ్డతండాలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రంగాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జంగనర్సింలు, శివశంకర్‌గౌడ్, మంజుల, రాజునాయక్, గబ్రు, రవిందర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, తుసీరాంనాయక్ పాల్గొన్నారు.


చౌదరిగూడ : మల్కాపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కాంగ్రెస్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

కొత్తూర్ : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచారని, ముదిరాజ్‌లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.17లక్షలతో సీసీ రోడ్డు పనులు, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ముదిరాజ్ భవనానికి తనవంతు సహాయ సహకారాలు అందించిన కాంగ్రెస్‌నాయకుడు శేఖర్‌గుప్తాను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీర్ రవికుమార్‌గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, ముదిరాజ్ సంఘం నాయకులు అంచె రాములు, మంగవెంకటేష్, పంతులు నర్సింహ, బాబు ముదిరాజ్, కేశమోని రమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్‌ముదిరాజ్, ఖాజాపాషా పాల్గొన్నారు.

ఉపాధి కరువై కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం

చేవెళ్ల, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహిస్తున్న జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం 'భారత ఆర్థిక వ్యవస్థ-పరిణమాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి చేరుకుందని చెబుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ మతోన్మాద శక్తులు పెచ్చరిల్లి పోతున్నాయని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పడానికి ముమ్మర యత్నం చేస్తుందని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపడం లేదన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్, జాతీయ జనసేవాదళ్ ఇన్‌స్ట్రక్టర్ మురళి, కేరళ ఇన్‌స్ట్రక్టర్ టీజీ విష్ణు, తెలంగాణ ఇన్‌స్ట్రక్టర్ గోష్క మోహన్, నాయకులు మారుపాక అనిల్, సీపీఐ రాష్ట్ర సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వండ్ల సత్యనారాయణచారి, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, శ్రీనివాస్, నాయకులు మక్బూల్, అంజయ్య, సుధాకర్‌గౌడ్, మీనాక్షి, జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి


చేవెళ్లలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

● టీడీపీ సీనియర్ నాయకుడు సుభాన్‌గౌడ్

చేవెళ్ల, మే 28(ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో టీడీపీని స్థాపించి ఉమ్మడి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు కాసుల సుభాన్ గౌడ్, చేవెళ్ల మండలాధ్యక్షుడు లొంక రాములుగౌడ్ అన్నారు. బుధవారం మాజీ సీఎం, దివంగత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చేవెళ్లలో ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించి కేక్ కట్ చేశారు. పటేల్ పట్వారీ వ్యవస్థలను పూర్తిగా రద్దుచేసి పేద ప్రజలకు ఎన్టీఆర్ న్యాయం చేశారని చెప్పారు. టీడీపీ ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. అంతకుముందు చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు కాసుల అశోక్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు రాజుగౌడ్, జి.కృష్ణ, సుధాకర్, కృష్ణ, అంజయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రంగారెడ్డి అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ యాలాల మహేశ్వర్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. ఉద్యమ కారులను గుర్తించి గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంలో 20 శాతం ఉద్యమ కారులకు కేటాయించాలని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక విభాగంలో వెయ్యి ఉద్యోగాలు కల్పించి ఉద్యమ కళాకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యారణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యారణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తోందన్నారు. పరిగి విద్యారణ్యపురిలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చేవిద్యా సంవత్సరం నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, ఇ.కృష్ణ, యాదవరెడ్డి, కె.సత్యనారాయణ, అయ్యూబ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌పవార్ పాల్గొన్నారు.

దేవరయంజాల్‌లో కల్తీ కల్లును అరికట్టాలి

శామీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్తీకల్లును అరికట్టాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రామ్‌మోహన్ ఎక్సైజ్ అధికారులను కోరారు. బుధవారం ఆయన మేడ్చల్‌లోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్థానికులు కల్తీ కల్లును తాగి అనారోగ్యం బారిన పడుతున్నారని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

దశలవారీగా ఇందిరమ్మ బిల్లులు

శామీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న వారికి దశలవారీగా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు గడ్డం రమేశ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పొన్నాల్‌లో అధికారులు 80మందికి ఇళ్లను మంజూరు చేశారన్నారు. బిల్లులు వస్తాయో రావోననే అనుమానం పెట్టుకోకుండా మంజూరైన వారంతా ఇంటి నిర్మాణం చేపడితే డబ్బు వస్తాయని తెలిపారు.

బీసీ గణన లెక్కలను బహిర్గతం చేయాలి

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని వెంకట్‌యాదవ్ అన్నారు. బుధవారం తాండూరులో న్యాయవాది గోపాల్‌నివాసంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, సయ్యద్ షూకుర్, యాదయ్య, అరుణ్‌కుమార్, జిలానీలతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన లెక్కలను, వాటి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. రాబోయే రోజుల్లో బహుజనులంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలపై బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో 5,308 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరిగిలో 3, తాండూరులో 7, కొడంగల్‌లో 1, వికారాబాద్‌లో 5, మోమిన్‌పేట్‌లో 2, కుల్కచర్లలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతోపాటు, ఏఎన్‌ఎంలను నియమించాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలని, కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో రేణుకాదేవి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కమిషనర్ గారూ... జర చూడండి!'

మేడ్చల్ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): 'కమిషనర్ గారూ.. నమస్తే.. వర్షాలు పడుతున్నాయి. డెంగ్యూ, కరోనా విష జ్వరాలు ప్రబలకుండా మీరు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జాగ్రత్తలపై వివరించండి.' అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. మేడ్చల్ పట్టణంలోని కొన్ని పాంతాలు బురదమయం అయ్యాయని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ కమిషనర్‌కు ఫోన్ చేశారు. పరిసరాలు అపరిశుభ్రం కాకుండా, జ్వరాలు ప్రజలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా ఎమ్మెల్యే అధికారితో ప్రాధేయపడుతూ ఫోన్‌లో మాట్లాడడంపై వీడియో చూసిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

వికారాబాద్, మే28(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ని తన చాంబర్‌లో బుధవారం వరి ధాన్యం సేకరణ ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేయటం, రవాణ సదుపాయం తదితర అంశాల పై కలెక్టర్ సంబంధిత అధికారులో సమీక్ష నిర్వహించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుతుపవనాలు ముందుస్తుగా ప్రవేశించినందున వర్షాలు కురియటం వల్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబెట్టటం రైతులకు ఇబ్బందిగా మారిందనివ ఆయన అన్నారు. దీని కారణంగా ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉండి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన అన్నారు. రైతులకు నష్టం జరుగకుండా ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన సదుపాయలు కల్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో ట్యాంక్ నిర్మాణం వద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మేడ్చల్ టౌన్, మే 28(ఆంధ్ర జ్యోతి): మేడ్చల్‌లోని జెడ్పీ బాలుర పాఠశాల స్థలంలో ట్యాంకుల నిర్మాణం చేయొద్దని బుధవారం పలువురు పూర్వ విద్యార్థులు తహసీల్దార్ సునిల్‌కు వినతి పత్రం ఇచ్చారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకోవటానికి మైదానం లేకుండా చేసి అధికారులు నీటిట్యాంక్ నిర్మాణానికి పూనుకోవడం శోచనీయమని వారన్నారు. తమ పూర్వీకులు పాఠశాల కోసం స్థలాన్ని ఇచ్చారని, ఈ స్థలంలో చదువుసంధ్యేలే కొనసాగాలి తప్ప వేరే వాటికి ఆ స్థలాన్ని వినియోగించొద్దని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌స్వామి, భద్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓటరు జాబితాపై సమావేశం

కొడంగల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై తహసీల్దార్ బీ.వి జయ్‌కుమార్ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. బుధవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఓటరు నమోదు గురించి చర్చించారు. పోలింగ్ బూత్‌లకు బూత్ లెవల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. అనిత, వివిధ పార్టీలనాయకులు పాల్గొన్నారు.

పశువులకు అంబులెన్స్‌ల ద్వారా సేవలందించాలి


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారి బాగేశ్ మిశ్రా

పరిగి,మే 28(ఆంధ్రజ్యోతి):పరిగిలోని పశుసంవర్ధకశాఖ 1962 అంబులెన్స్‌ను మంగళవారం 1962 అంబులెన్స్ అధికారి బాగేశ్‌మిశ్రా, ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలు, మందులను పరిశీలించారు. అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ.. అంబులెన్స్‌లో గ్రామాలకు వెళ్లి పశువులకు సేవలందించాలని సూచించారు. ఏక్కడి నుంచైనా సమాచారం రాగానే స్పందించాలని ఆయన చెప్పారు.

డబ్బులిస్తేనే రుణాలిప్పిస్తా!

రంగాపూర్ వీవోఏ చేతివాటం

చర్యలు తీసుకోవాలని మహిళల ఆందోళన


వీవోఏ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న రంగాపూర్ మహిళలు

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలిప్పటించడంలో కింది స్థాయి సిబ్బంది డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులిస్తే రుణాలిప్పిస్తామని చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారు. రంగాపూర్ వీవోఏ యాదయ్య తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 15 సంఘాలున్నాయి. ఐదు సంఘాల వారికి రూ.5లక్షల నుంచి రూ.20లక్షల రుణాలిచ్చారు. సభ్యులు తమకు రుణం వొద్దని చెప్పినా మంజూరు చేయిస్తున్నాడని మహిళలు వాపోతున్నారు. తీరా లోన్ తీసుకున్న తర్వాత రూ.లక్షకు రూ.వెయ్యిచొప్పున తనకు కమిషన్ ఇవ్వాల్సిందేనని వీవోఏ వసూలు చేస్తున్నాడని మహిళలు చెబుతున్నారు. వీవోఏ యాదయ్య 15ఏళ్ల నుంచి ఇలాగే డబ్బులు దండుకుంటున్నాడని మహిళలు ఆరోపిస్తున్నారు. బుధవారం గ్రామంలో ఆందోళన సైతం వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యకరంగానూ ప్రవర్తిస్తుంటాడని చెప్పారు. ఎవరికి చెప్పుకున్నా తనకేం భయం లేదని బెదిరిస్తున్నాడని మహిళలు వాపోతున్నారు. అధికారులు ఈ అవినీతి, మహిళలకు మర్యాద ఇవ్వని వీవోఏపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏపీఎం శ్రీనివాసరెడ్డిని స్పందన అడగ్గా.. వీవోఏకు డబ్బులు ఎవరిచ్చారో చెప్పాలని కోరగా ఎవరూ ముందుకు రావడం లేదని, అయినా అతడిపై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిబ్బంది ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పన్నారు.

సంతకం లేకుండానే రుణం ఇచ్చారు



మాకు రుణం వద్దన్నా.. మా సంతకాలు లేకుండానే లోన్ మంజూరు చేయించాడు. తీరా లక్షకు రూ.వెయ్యి చొప్పున మహిళల నుంచి వసూలు చేశాడు. ఎందుకని నిలదీస్తే పైఅధికారులకు ఇవ్వాలని చెబుతున్నాడు. అలాగే ఈ వీవోఏ మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

- సరిత, సంఘం సభ్యురాలు

దారికి తేరా?


తాండూరు మండలం గౌతాపూర్ నుంచి కొత్లాపూర్ వరకు రోడ్డుపై దుమ్ము

(ఐదో పేజీ తరువాయి)

నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.1100కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా, కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయి. ఇవే కాకుండా ఎస్టీ ఎల్‌డీఎఫ్ కింద ఐదు పనులు మంజూరు కాగా, కొడంగల్ పరిధిలో రూ.27.87 కోట్లతో మూడు రోడ్లు, తాండూరులో రూ.5 కోట్లు, పరిగిలో రూ.6 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నాన్‌ప్లానింగ్ కింద రూ.5.50 కోట్లతో మూడు పనులు, సీఆర్ఎఫ్ కింద రెండు పనులకు రూ.60కోట్లు మంజూరయ్యాయి. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో 45 కిలోమీటర్లు గుర్తించారు. రోడ్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదంటున్నారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు

మొయినాబాద్ మండలం రెడ్డిపల్లి రోడ్డు బీటీకి మోక్షం కలగడం లేదు. బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన చేసి వదిలేశారు. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయి. వికారాబాద్ జిల్లా పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి రోడ్డు విస్తరణ కోసం రూ.340 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కానీ.. పనులు ఇంకా ప్రారంభించలేదు.

విస్తరణకు నోచని రోడ్లు

మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ నుంచి తంగెడపల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ స్టేజి నుంచి ఎర్రన్నగూడ వరకు కొత్తగా బీటీ రోడ్డు మంజూరైంది. కానీ.. పనులు మాత్రం ప్రారంభం కాలేవు.

నత్తనడకన మరమ్మతులు

షాబాద్ మండలంలో మద్దూరు గేట్ నుంచి నాగరగూడ వరకు 9 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఈ రహదారిలో అక్కడక్కడ కల్వర్టులు నిర్మాణం చేశారు. కాగా కాంట్రాక్టరుకు మొదటి విడతగా రూ.20 కోట్ల నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇబ్రహీంపట్నం మండల పరిధి చెర్లపటేల్‌గూడ- కందుకూరు మండలం రాచులూరుల మధ్య 18 కిలోమీటర్ల పొడవునా ఏడు మీటర్ల వెడల్పుతో రూ.30 కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

దుమ్ము ధూళితో అవస్థలు

తాండూరు మండలం గౌతాపూర్-కొత్తపూర్ మధ్య రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రోడ్డుపై దుమ్ము, ధూళి చెలరేగి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించారు. ఏడాది కాలంగా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఓ వైపు కంకర, మరో వైపు మట్టి పోసి వదిలేశారు. ఇదే మార్గం ద్వారా కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు సాగుతున్నాయి. మట్టిపోసి వదిలేయడంతో లారీలు వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనదారులు దుమ్ముతో అవస్థలు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

షాద్‌నగర్ నుంచి కిషన్ నగర్, చాంద్రాయణగూడ నుంచి మామిడిపల్లి వరకు రోడ్డు విస్తరణకు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. షాద్‌నగర్ నుంచి పరిగి రోడ్డు నాలుగు లేన్ల విస్తరణకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధుల కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు ఎదురు చూస్తున్నారు.

త్వరలో పూర్తి కానున్న పనులు

షాద్‌నగర్ నుంచి కేశంపేట వరకు రూ.30 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నారు. మరో రెండు వారాల్లో పనులు పూర్తి కానున్నాయి. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ నుంచి మల్లన్నగుట్ట వరకు రూ.10కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి.

మరమ్మతులకు నోచని రోడ్లు ఇవే..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం లాల్‌పహాడ్ నుంచి అంగడి చిట్టంపల్లి, కుల్కచర్ల నుంచి దాదాపూర్, చౌడాపూర్ నుంచి మరికల్, ముజాహిద్‌పూర్ గేట్ నుంచి ఉదయపూర్, లింగంపల్లి నుంచి గండి చెరువు, గడిసింగాపూర్ నుంచి ఇబ్రహీంపూర్, రాకంచర్ల నుంచి కంకల్, పుట్టపర్తి నుంచి అనంతసాగర్, దోమ నుంచి పాలేపల్లి ఐనాపూర్, రంగాపూర్ నుంచి మంచన్నపల్లి, చిట్టంపల్లి నుంచి కంకల్ వరకు ఉన్న రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లు సత్వరమే మరమ్మతులు చేపటాల్సిన అవసరం ఉంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పామెన నుంచి చెన్‌వెల్లి, బస్తేపూర్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేవు.


బీటీ లేచి కంకర తేలిన చేవెళ్ల మండలం పామెన-చన్‌వెల్లి రోడ్డు


చెర్లపటేల్‌గూడ- రాచులూరుల మధ్య కంకర పరిచిన రహదారి


కార్యాలయానికి తెచ్చిన ఫర్నిచర్, ఫైళ్లు

ఎంపీడీవో కార్యాలయంలోకి మున్సిపల్ ఆఫీస్

ఘట్‌కేసర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయానికి మార్చారు. మండలంలోని అన్ని పంచాయతీలను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎంపీడీవో కార్యాలయం ఖాళీగా ఉంది. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం ఇరుగ్గా ఉండటంతో మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి కమిషనర్ భాస్కర్‌రెడ్డి పూల మాలలు వేసి తన చాంబర్‌లో కూర్చున్నారు. కార్యాలయ ఫర్నిచర్, ఫైళ్లను ట్రాక్టర్లలో కొత్త ఆఫీసుకు తరలిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం విశాల భవనంలోకి మారడంతో అధికారులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లారీలు రాక తూకంలో జాప్యం

ధారూరు, మే28(ఆంధ్రజ్యోతి): లారీలు రాక కొనుగోలు కేంద్రంలో తూకానికి జాప్యమవుతుందని రైతులు జిల్లా సివిల్ సప్లయీస్ డీటీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. నాగసమందర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించగా రైతులు సమస్యలను వివరించారు. 40కిలోల బస్తాకు రెండున్నర కిలోలు తరుగు ఇస్తేనే తీసుకుంటామని మిల్లర్లు అంటున్నారని కేంద్రం ఇన్‌చార్జి యాదయ్య చెబుతున్నాడని డీటీకి వివరించారు. వర్షాలతో వడ్లు నానుతున్నాయని రైతులు వాపోయారు. గురువారం జిల్లా అధికారిని ఇక్కడికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తానని అధికారి హామీ ఇచ్చారు.

చినుకు పడితే చిత్తడే..


తిరుమలకాలనీలో రోడ్డు దుస్థితి

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతున్నాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. మున్సిపల్ అధికారులు పాత పరిగిలో రోడ్లు ఉన్నా వాటిపైనే మళ్లీ రోడ్లు వేస్తున్నారే తప్ప, అసలు రోడ్లు లేని కాలనీల గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిగి పట్టణంలోని తిరుమల రెసిడెన్సీ, భవానినగర్, వెంకటేశ్వరకాలనీ, తిరుమలహిల్స్ తదితర కాలనీల్లో వందశాతం పన్నులు వసూలు చేసినా రోడ్లు మాత్రం వేయలేదు. సోమ, మంగళవారాల్లో కురిసిన చిరుజల్లులకు రోడ్లపై నడువలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నేడు తాండూరులో మెగా జాబ్ మేళా

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తాండూరులో గురువారం నిర్వహిస్తున్న 'మెగా జాబ్ మేళా' ఏర్పాట్లను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. 11వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల ప్రాంతాల నిరుద్యోగులకు ఈ మేళాలో అవకాశం కల్పించనున్నారు. తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఉదయం10 నుంచి సాయంత్రం 5గంటల జాబ్ మేళా నిర్వహిస్తారు. యువతీ, యువకులు రిజిస్ట్రేషన్‌కు 8కౌంటర్లను ఏర్పాటు చేశారు. కేపీఆర్ డెవలపర్స్, కేఫ్ కాఫీ డే, క్రీమ్‌స్టోన్, పేటీఎం, జెప్టో, మ్యాక్స్ ఫ్యాషన్ రీటైల్ తదితర పేరొందిన 52 సంస్థలు, కంపెనీలు ఉద్యోగులను ఎంపిక చేసుకోనున్నాయి. జాబ్‌మేళాలో తాండూరు ప్రాంత నిరుద్యోగులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపికైన వారికి సాధ్యమైనంత వరకు వరకు ఇక్కడే ఆర్డర్ కాపీలిచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. నిరుద్యోగులు భారీ సంఖ్యలో వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూమి ఒకరిది.. పరిహారం మరొకరికి!

న్యాయం చేయాలంటూ ఆర్డీవోకు బాధిత రైతు వినతి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ముచ్చర్ల రైతులు

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాల పరిధిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో తమకు అన్యాయం జరిగిందని మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన రైతు బుధవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి విన్నవించారు. ఈమేరకు ముచ్చర్ల మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో రైతు ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ముచ్చర్ల గ్రామానికి చెందిన బొర్ర భిక్షపతికి ఆయన తండ్రి నుంచి అదే రెవెన్యూ పరిధిలోని 288/1క్యూ నెంబర్‌పై 5 ఎకరాల భూమి సంక్రమించింది. ఆ భూమిని 2006లో అదే గ్రామానికి చెందిన కుందేళ్ల రాములు కౌలుకు తీసుకున్నాడు. భిక్షపతికి కౌలు డబ్బులతో పాటు రూ.30వేల నగదును అప్పుగా ఇచ్చాడు. అయితే, ఆ తరువాత భిక్షపతి డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో గ్రామస్తులతో పంచాయితీ పెట్టించిన రాములు.. భిక్షపతికి తెలువకుండా ఆయనకు ఉన్న 5 ఎకరాల భూమిని 2006లో తనకు భిక్షపతి అమ్మినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. విషయం తెలుసుకున్న భిక్షపతి 2012లో ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించాడు. దాంతో కోర్టు ప్రైవేటు కేసుగా పరిగణించి విచారణానంతరం రాములుపై కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసు అధికారులను ఆదేశించింది. అయితే, పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి ఊరుకున్నారు. అసలు పట్టాదారు భిక్షపతి జిల్లా కలెక్టరేట్‌లో 2015లో తనకు అన్యాయం జరిగిందని కేసు దరఖాస్తు చేశారు. 2018లో అప్పటి కలెక్టర్ భిక్షపతికి అనుకూలంగా తీర్పునిస్తూ రెవెన్యూ రికార్డుల్లో రాములు పేరును తొలగిస్తూ భిక్షపతి పేరును నమోదు చేయాలంటూ తీర్పు ఇచ్చారు. అయితే, అప్పటికే రాములు మృతిచెందడంతో అతడి భార్య జంగమ్మ పేరిట స్థానిక రెవెన్యూ అధికారులు విరాసత్ చేశారు. ఇదిలా ఉండగా.. అధికారులు భిక్షపతి పేరుపై కాకుండా రాములు భార్య జంగమ్మ పేరుతో 2023లో ఫార్మసిటీకి తీసుకున్న భూమిపై రూ.కోటీ 25లక్షల పరిహారం మంజూరు చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతు భిక్షపతి గ్రామస్తులతో కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని ఆర్డీవో జగదీశ్వరెడ్డికి విన్నవించారు.

ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వం : ఆర్డీవో

ముచ్చర్ల రైతు భిక్షపతికి జరిగిన అన్యాయంపై ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ముచ్చర్ల, మీర్ఖాన్‌పేట రెవెన్యూలో గతంలో ఫార్మసిటీ పేరుతో సేకరించిన భూములపై కొంత మేరకు రైతులకు అన్యాయం జరిగిందన్నారు. భిక్షపతికి చెందిన భూమిపై న్యాయస్థానంలో తీర్పునిచ్చిన అప్పటి అధికారులు అతడికి కాకుండా రాములు భార్యకు పరిహారం మంజూరు చేశారని, దీనిపై గ్రామ స్థాయిలో సర్వే చేసి సదరు రైతుకు న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

కందుకూరు రెవెన్యూ పరిధిలో నెలకొల్పనున్న మెస్సర్స్ గాంగే మినరల్స్ సంస్థపై స్థానిక రైతులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇక్కడ మైనింగ్‌ను ఏర్పాటు చేయడం పట్ల స్థానిక రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని అభిప్రాయం తెలియజేశారు. హైదరాబాద్ నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాత్రం ఇక్కడ మైనింగ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేన్నర్సయ్య, తహసీల్దార్ కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దోమ ఎంపీవోగా నందకిషోర్

దోమ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో నూతన ఎంపీవోగా నందకిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కొన్ని నెలలుగా ఇన్‌చార్జి ఎంపీవోగా రాజేశ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో నందకిషోర్‌ను ఎంపీడీవో గమ్యానాయక్, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ నరేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఆర్ఐగా శివచరణ్

బషీరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐగా శివచరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ నాగార్జునరెడ్డి యాలాల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో అక్కడి కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఐ శవచరణ్ ఇక్కడికి వచ్చారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

ఘట్‌కేసర్, మే 28 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి సీనియర్ వైద్యుడు జంగయ్య అన్నారు. అంతర్జాతీయ హరితయోగా దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వాసుపత్రిలో ఆయూష్ ప్రోగ్రామ్ జిల్లా మేనేజర్ డాక్టర్ శ్రీవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలను పెంచుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. ప్రధానంగా పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు అందరి కృషి అవసరమని అన్నారు, మొక్కలు పెంచేందుకు ఇళ్లలో అవకకాశంలేని వారు కనీసం కుండీల్లోనైనా అనేక రకాల మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్వాతి, కిషోర్, సౌజన్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వైద్యుడు

అక్రమ రిజిస్ట్రేషన్లపై మంత్రి సీరియస్

(5వ పేజీ తరవాయి)

సంబంధించి ఇకపై క్రయ విక్రయలు జరగకుండా అధికారులు నిలిపివేశారు. గతంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా పని చేసిన ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లపై కూడా విచారణను ప్రారంభించినట్లు తెలిసింది. వారి పిరియడ్‌లోని రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తాండూరు డీటీసీపీ అప్రూవల్ పొందని ప్లాట్లు దాదాపు ఐదు వేల వరకు ఉంటాయని ఐదేళ్లుగా ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేశారు.కచ్చ ప్లాట్లకు రిజిస్ట్రేషర్లు జరిగేలా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లు విన్నపాలు చేసిన విషయం తెలిసిందే.

ఈ వ్యవహారం వెనుక ఉన్నదెవరు?

ఈ వ్యవహారం వెనుక ఉన్నది అధికారులా? లేక రాజకీయా నాయకులా? అన్న దానిపై తాండూరులో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఏదైనా సర్వే నంబర్‌లో 2020 ఆగస్టు 26నాటికి సేల్ డీడ్ ద్వారా పది శాతం ప్లాట్లు అమ్ముడుపోయి ఉంటే మిగిలిన 90శాతం ప్లాట్లు నిబంధనల మేరకు క్రమబద్ధీకరించుకోవచ్చు. ఈ విషయాన్ని సాకుగా తీసుకొని అక్రమ రిజిస్ట్రేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం వెనుక రాజకీయ ప్రమేయం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. పెద్దఎత్తున డాక్యుమెంట్లు, స్కానింగ్ పెండింగ్‌లో ఉండడంతో అసలు కథ బయట పడింది. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి నివేదికను విచారణ అధికారులు అందజేస్తే పాత్రదారులు, సూత్రదారులు బయటికి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో నిఘా విభాగం ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన నాగలతకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం బోయిన్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నాగలతకు సీఎంఆర్ఎఫ్ సాయం లభించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె ఆర్థిక సాయం పొందేందుకు మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు తోడ్పడటంపై పట్ల ఎమ్మెల్యే అభినందించారు.

సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్క సామాన్యునికి సంక్షేమ ఫలాలను అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్‌కు చెందిన ఎల్లంకి మహేందర్‌గౌడ్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలను పొందాడు. ఆర్థిక సాయం కోసం ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం విచారణ జరిపి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.60వేలను మంజూరు చేసింది. దీంతో బుధవారం లబ్ధిదారుడికి జైపాల్‌రెడ్డి రూ.60వేల సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీతారామస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త హరిక్రిష్ణ, ఎల్లంకి విజయ్ పాల్గొన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ


సాయిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ◄

తాండూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటబాస్పల్లికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి సతీమణి నర్సమ్మ కొన్ని రోజుల క్రితం మృతిచెందారు. తఈ విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి సాయిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నర్సమ్మ మృతికి గల కారణాలను కుమారుడు వీరేందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ స్వరూపావెంకట్‌రాంరెడ్డిలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు గుర్రంపల్లి రాందాస్, సాయిపూర్ నర్సింహులు తదితరులున్నారు.


కులకచర్లలో ఇళ్ల మధ్య మురుగు నీటి గుంత


పుట్టపహాడ్‌లో ఇళ్ల మధ్యలో మురుగు

గ్రామాల్లో పారిశుధ్యం

అస్తవ్యస్తం

● రోగాల బారిన జనం ..

కులకచర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో మురుగు నీటి గుంతలు ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. మండల కేంద్రం కులకచర్లతో పాటు పుట్టపహాడ్‌లో వీధుల్లో మురుగు నీరు ప్రధాన రహదారిలో ప్రవహిస్తోంది. కాలువల్లో దుర్వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో మురుగునీరు చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. తీవ్ర దుర్గంధం వస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల/దోమ, మే 28(ఆంధ్రజ్యోతి):సబ్సిడీ జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. నేలను సారవంతం చేసేందుకు ఈ విత్తనాలు దోహదపడతాయన్నారు. ఏవో వీరస్వామి మాట్లాడుతూ డీసీఎంఎస్, ఆగ్రో రైతు సేవ కేంద్రంలో వంద జీలుగ విత్తన బస్తాలున్నాయని తెలిపారు. 50శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు ఆనంద్, కృష్ణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, చాకలి వెంకటేశ్ పాల్గొన్నారు. దోమ మండలం దిర్సంపల్లిలో జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సత్యయ్యగౌడ్, బందెయ్య, రాములుగౌడ్ పాల్గొన్నారు.

దుద్యాల: దుద్యాలలోని ఆగ్రోస్ కేంద్రంలో జనుము, జీలుగ విత్తనాలను కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఏవో నాగరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీసీ వెంకటయ్యగౌడ్, సీతారాంనాయక్, పులిందర్‌రెడ్డి, కృష్ణ, సత్యనారాయణ, నర్సిరెడ్డి, ఏఈవోలు భావన, జ్యోతి, మాణికేశ్వరి, రేణుక, దుకాణదారు ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

వానొచ్చే.. వరదొచ్చే


చౌడాపూర్‌లో కురుస్తున్న వర్షం

(5వ పేజీ తరవాయి)

14.5 మి.మీ. వర్షం కురిసింది. పెద్ద ఉమ్మెంతాల్‌లో 11.8మి.మీ., దౌల్తాబాద్‌లో 11మి.మీ., ప రిగిలో 7.5, తొర్మామిడిలో 6.8, దావల్‌పూర్‌లో 5.3 మి.మీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లాలో కేశంపేట్ మండలం, తొమ్మిదిరేకులలో 38.8 మి.మీ కురిసింది. చౌదరిగూడెం మండలం, కా సులాబాద్‌లో 14.0 మి.మీ, షాబాద్ మండలం చందన్‌వెల్లిలో 10.8మి.మీ., తలకొండపల్లి మండ లం, చుక్కాపూర్‌లో 8.5మి.మీ., కొందుర్గులో 6.5 మి.మీ, చేవెళ్ల మండలం కంద్వాడలో4.5 మి.మీ. వర్షం కురిసింది. వర్షంతో వాగులు, వంకల్లో వర ద ప్రవహించింది. వికారాబాద్‌లో సాయంత్రం గంటన్నరపాటు వర్షం కురిసింది. మెయిన్ రోడ్లపై వరద పొంగి ప్రవహించింది. రైతు బజార్‌లో భారీగా నీరు రావడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షానికి కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. తొలకరిలోనే వర్షాలు భారీగా కురుస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏకధాటిగా..

చౌడాపూర్ మండలంలో భారీ వర్షం కురిసిం ది. ఏకధాటిగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బషీరాబాద్ మండలంలో అరగంటకుపైగా వర్షం కురువడంతో ప్రధాన, అంతర్గత రోడ్లపై వరద నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయ్యాయి. తాండూరులో సాయంత్రం రెండుగంటలపాటు వర్షం పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వదిలే సమయంలో వర్షం కురవడంతో ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. వర్షం నీటిలో కూరగాయలు, పండ్ల వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు వరద నీటితో నిండాయి. కాలనీల్లో మట్టి రోడ్లు బురదమయంగా మరాయి. ఫ్లైఓవర్ కింద కాల్వ పనులు జరుగుతుండటం, వర్షంతో వాహనదారులు పాట్లు పడ్డారు. మర్పల్లి మండల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి, బార్వాద్, ఎన్కెపల్లి, ఎన్నారం గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షాలు వానాకాలం సాగుకు అనుకూలంగా ఉంటాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.


తాండూరు: వర్షంలో వెళ్తున్న ఉద్యోగులు


బషీరాబాద్: మంతన్‌గౌడ్ వద్ద భారీ వర్షం

అన్నదాతల అవస్థలు

కొడంగల్‌లో భారీ వర్షానికి వరద నీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కొడంగల్, మండల గ్రామాల్లో వర్షంతో పొలాల్లో నీరు నిలిచింది. బొంరాస్‌పేట్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లో వడ్ల బస్తాలు తడి సిపోయాయి. మెట్లకుంట, బొంరాస్‌పేట్, కొత్తూర్ గ్రామాల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యపు రాశులు తడవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లారీలు రాక. గన్నీ బ్యాగులు అందించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

మర్పల్లి: ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో వరద ➤




కోట్‌పల్లి: బార్వాద్‌లో వర్షానికి రోడ్లపై పారుతున్న నీరు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రారెడ్డి, తదితరులు

కీసర రూరల్/ఘట్‌కేసర్ రూరల్, మే28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహా నాయకుడు నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) అని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో ఎన్టీఆర్ 102వ జయంతిని బీజేపీ, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కలిసి సంయుక్తంగా నిర్వహించారు.ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దయాకర్, అన్నంరాజ్ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ ఘట్‌కేసర్ మండల టీడీపీ సీనియర్ నాయకుడు వేముల సంజీవగౌడ్ నగరంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకుడు వేముల సంజీవగౌడ్


నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తదితరులు

నిశ్చితార్థానికి హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్

తాండూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలం చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి అన్న కూతురు నయనిక, సృజన్‌రెడ్డిల నిశ్చితార్థం బుధవారం జరిగింది. అంతారం రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో జరిగిన ఈ శుభకార్యానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. కాబోయే వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు, గడ్డలి రవీందర్, బీదర్ రాజశేఖర్, అబ్దుల్ ఖవి, బిర్కట్ రఘు, భగవాన్, లేబర్ సెల్‌నాయకులు పునీత్‌కుమార్, అయ్యూబ్‌ఖాన్, ఆనంద్‌గౌడ్, కాంతు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సతీ అనసూయ వీధి నాటకం

బొంరాస్‌పేట్, మే 28(ఆంధ్రజ్యోతి):బొంరాస్‌పేట్‌లో మూడు రోజులపాటు సతీ అనసూయ వీధి నాటకాన్ని ప్రదర్శించారు. సినిమాలు ఎన్ని వస్తున్నా వీధి నాటకాలను సైతం జనం ఆదరిస్తున్నారు. మూడు రాత్రుల నాటక ప్రదర్శనను గ్రామస్తులు తిలకించడంతో విజయవంతంగా ముగిసింది.


వీధి నాటకంలో కళాకారులు


మజ్జిగ పంపిణీ చేస్తున్న అయ్యప్ప దీక్షా సమితి ప్రతినిధులు

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి):అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, తాండూరు అయ్యప్ప ఆలయ కమిటీ సంయుక్తంగా బుధవారం బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయంలో పల్లకిసేవ, పడిపూజ నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈవో శివకుమార్ కుమారుడు శరత్ అన్నదానం చేశారు. ప్రసాద వితరణ అక్షయగౌడ్ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు బస్వరాజ్, జైపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్, భీమాచారి, వెంకట్‌రావు, హన్మయ్యగౌడ్, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాన్ని భరించలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసున్నాడు. ఈ సంఘటన శామీర్‌పేట్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌గడి మలక్‌పేట్‌కు చెందిన కొండి మల్లేష్(57) కూలి చేసేవాడు. కొంత కాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలియాబాద్ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయాల్లో విగ్రహాల అపహరణ

కులకచర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): దాస్యనాయక్ తండా, వన్నెకారి కుచ్చ వెంకటేశ్వర, హనుమాన్ ఆలయాల్లో చోరీజరిగింది. మంగళవారం రాత్రి దొంగలు తలుపులు విరగ్గొట్టి వెండి విగ్రహాలను ఎత్తుకపోయారు. బుధవారం తండావాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేశ్ చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

● కుక్కపిల్ల కాటు.. మహిళ మృతి


మృతురాలు లక్ష్మి(ఫైల్)

పెద్దేముల్, మే 28(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యానికి ప్రాణం బలైంది. వివరాల్లోకి వెళ్తే.. జనగాం గ్రామానికి చెందిన నారబోయిన లక్ష్మి(35)కి మూన్నాలుగు నెలల క్రితం వారి పెంపుడు కుక్కపిల్ల వేలిపై కరిచింది. కుక్క పిల్లే కదా అని రేబిస్ వ్యాక్సిన్ వేసుకోలేదు. కుక్క కరిచిన గాయం మానింది. కానీ లక్ష్మి మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు అది కుక్క కాటు ప్రభావం అని గుర్తించలేదు. ఆర్‌ఎంపీతో చికిత్స చేయించారు. సోమవారం రాత్రి లక్ష్మి పిచ్చిపిచ్చిగా చేయడంతో కుటుంబ సభ్యులు ఆమెను తాండూరు జిల్లాసుపత్రికి తీసుకుపోయారు. అక్కడ ఉన్న నర్సు ఏదో ఇంజక్షన్ ఇచ్చి, డాక్టర్ వచ్చే వరకు ఆగాలని, టెస్టులు చేయించాల్సి ఉంటుందని తెలిపింది. కానీ ఆమె పరిస్థితి చూసిన బంధువులు వికారాబాద్ ఆస్పత్రికని బయల్దేరారు. వికారాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లేలోపే లక్ష్మి మృతి చెందింది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం



కొడంగల్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి భజన మండలి కొడంగల్ ఆధ్వర్యంలో బుధవారం అక్షర హైస్కూల్‌లో శంకర కంటి ఆస్పత్రి నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైందని ఆప్తమాలజీ డాక్టర్ వర్ష తెలిపారు. వైద్య శిబిరంలో 86మందికి పరీక్షలు నిర్వహించగా 20 మందికి కంటిలో శుక్లాలు ఉన్నటు గుర్తించి వారిని ఆపరేషన్‌ల కోసం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రికి పంపించినట్టు చెప్పారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన


కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధికి ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం అమలు చేసే రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తుల బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు పరిశీలించారు. 25 గ్రామపంచాయితీల నుంచి ఎస్సీ/ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్ల కింద 2వేలకుపైగా దరఖాస్తులొచ్చినట్లు అధికారులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

దోమ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. బుధవారం దోమలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాలపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

దోమ, మే 28(ఆంధ్రజ్యోతి): బొంపల్లి, అయినాపూర్ గ్రామాల్లో బుధవారం వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంటల మార్పిడి, నూతన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. సంస్థ కో-ఆర్డినేటర్ అనిల్ మాట్లాడుతూ.. రైతులు ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మీన, రైతులు చంద్రశేఖర్, భీమయ్య, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొలంలో నుంచి రోడ్డు నిర్మాణం సరికాదు

బొంరాస్‌పేట్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిమైలారానికి చెందిన కడంపల్లి బాలయ్య భూమిలో నుంచి రోడ్డు నిర్మాణం సరైంది కాదని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం మాట్లాడుతూ.. బాపన్‌చెరువు తండాకు రోడ్డు పనులకుగాను రైతుకు నోటీసు ఇవ్వకుండా చేపట్టడం తగదన్నారు. రైతుకు అండగా పోరాటం కొనసాగిస్తామన్నారు. నాయకులు బుస్స చంద్రయ్య, వెంకటయ్య, రమేశ్‌బాబు, కొత్తూర్ చంద్రయ్య, దస్తప్ప, బాలరాజ్, సాయిలు తదితరులు ఉన్నారు.

గ్రూప్ ఉద్యోగాలకు తాండూరు యువకుడి ఎంపిక


క్రాంతి కుమార్‌ను అభినందిస్తున్న బీసీ నాయకులు ◄

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తాండూరుకు చెందిన కుర్వ క్రాంతి కుమార్ గ్రూప్-1, 2 పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన న్యాయవాది గోపాల్ కుమారుడు క్రాంతికుమార్ రెండు పోస్టులకు పరీక్షలు రాసి ఎంపికయ్యారు. బుధవారం తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌యాదవ్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, సయ్యద్ షూకర్, అరుణ్‌రాజ్ అతడిని సన్మానించారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు


సీఎం రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ నాయకులు ◄

దుద్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు ఘన నివాళులు

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి):వీర సావర్కర్ జయంతి సందర్భంగా ఆయనకు బీజేపీ నాయకులు బుధవారం నివాళి అర్పించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, రజనీకాంత్, రాజు, ప్రకాశ్ పాల్గొన్నారు.